

ఖేలో ఇండియా క్రీడల్లో 'జ్ఞానాంబికా' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లె

ఖేలో ఇండియా క్రీడల్లో శ్రీజ్ఞానాంబికా డిగ్రీ కళాశాల కబడ్డీ అమ్మాయిల విభాగంలో 32.3 పాయింట్స్ తేడాతో గవర్నమెంట్ డిగ్రీ కళాశాల విద్యార్థినిలపై గెలుపొందారని కరస్పాండెంట్ డాక్టర్ రాట కొండ గురుప్రసాద్ తెలిపారు. పురుషులు కబడ్డీలో బి.టి. కళాశాల విధ్యార్థులపై 39.7 పాయింట్స్ తేడాతో మొదటి స్థానాన్ని, పురుషుల విభాగంలో మొదటి స్థానాన్ని, వాలీబాల్‌లో పురుషుల, స్త్రీల విభాగంలో రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నారన్నారు. వీరికి అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మెమోంటోలు, మెడల్స్ విద్యార్థులకు ప్రదానం చేశారని తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను గురు ప్రసాద్, ప్రిన్సిపల్ రమాదేవి, ఫీజికల్ డైరెక్టర్స్ శరత్‌కుమార్ నాయక్, జగదీష్‌లను అభినందించారు.



ప్రతిభ కనబరచిన విద్యార్థులతో కరస్పాండెంట్ గురుప్రసాద్

జిల్లా అభివృద్ధిలో బ్యాంకర్ల భాగస్వామ్యం కీలకం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్


బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా అభివృద్ధిలో బ్యాంకర్ల భాగస్వామ్యం ఎంతో కీలకమని, సమాజ ఆర్థికాభివృద్ధి తోపాటు జిల్లా ఆర్థిక ప్రగతికి బ్యాంకర్లు విరివిగా రుణాలు అందించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి బ్యాంకర్లను ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టెటివ్ కమిటీ (డిసిసి), డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ (డిఎల్‌ఆర్‌సి) బ్యాంకర్స్ సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో జిల్లాలోని అన్ని బ్యాంకులకు మొదటి త్రైమాసికం ముగిసేనాటికి నిర్దేశించిన పలురకాల రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ఆయా బ్యాంకుల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం, సహకారం ఎంతైనా అవసరమన్నారు. జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను మూడవ త్రైమాసికం డిసెంబరు 31 నాటికి జిల్లా క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.10,290 కోట్లకు గాను రూ.13,544 కోట్ల రుణాలు మంజూరు చేసి 131.62శాతం ఆర్థిక ప్రగతిని సాధించిందని చెప్పారు. ప్రాధాన్యత రంగంలో రూ.8804 కోట్ల లక్ష్యానికి గాను రూ.10929 కోట్లు మంజూరు చేసి 124.31 శాతం ప్రగతి సాధించారన్నారు. అన్నమయ్య జిల్లా వ్యవసాయ ఆధారిత జిల్లా అని, ఈ రంగంలో వ్యవసాయ రుణాలలో రూ.7573 కోట్లు లక్ష్యానికి రూ.9,741 కోట్లు మంజూరు చేసి 132 శాతం ఆర్థిక ప్రగతిని సాధించామని చెప్పారు. ఇతర ప్రాధాన్యతా రంగాలలో భాగంగా ఎంఎస్‌ఎంఇ సెక్టార్‌కు సంబంధించి రూ.987 కోట్లు మంజూరు చేసి కేవలం 7.5శాతం ప్రగతి సాధించారని, దీన్ని మరింత మెరుగుపరచాలని ఆర్‌బిఐ సూచించిన మేరకు 18 మేర రుణకల్పన ఉండాలని అన్ని బ్యాంకులకు సూచించారు. రూ.2,354 కోట్లు విద్యా రుణాలు, రూ. 2,803 కోట్లు గృహ రుణాలు అందజేశారని, అర్హత మేరకు రుణాల మంజూరును పెంచాలని తెలిపారు. ఆర్థిక చేకూర్పులో భాగంగా జిల్లాలోని అన్ని గ్రామాలలో బ్యాంకు బ్రాంచ్ ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని బ్యాంకర్లకు సూచించారు. ఆర్థిక అక్షరాస్యత పై విస్తృత అవగాహన కల్పించాలని ఎల్డీఎంకు సూచించారు. మహిళా సంఘాలకు రుణకల్పనలో 64 శాతం ప్రగతి సాధించారని, ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా 100 శాతం రుణాలు కల్పించాలన్నారు. పీఎం ఈజీపి పథకం కింద గ్రౌండ్ అయిన 106 యూనిట్లకు రూ.64 కోట్లు, ముద్ర రుణాల కింద 19848 యూనిట్లకు రూ 394 కోట్లు రుణాలు అందించినట్లు పేర్కొన్నారు. పీఎం విశ్వకర్మ, స్టాండ్ అప్ ఇండియా పథకంలలో ప్రగతిలో చాలా వెనుకబడి ఉన్నారని ఈ మాసాంతంలోగా లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. 3662 మంది మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రూ.55.78 కోట్లు రుణాలు అందించారని చెప్పారు. 583 మంది కౌలు రైతులకు రుణాల అందించారని చెప్పారు. బ్యాంకర్లు సమర్థవంతంగా పని చేస్తేనే ఆర్థిక వ్యవస్థ మరింత దృఢంగా ఉంటుందన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల కోసం అనేక రకాలయిన సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అందుకు సంబంధించి అన్ని రకాల బ్యాంకు శాఖలు ఆయా పట్టణ, గ్రామీణ పరిధిలో రుణ పథకాలకు అర్హత పొందిన లబ్దిదారులకు పెండింగ్ లేకుండా రుణాలు అందించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. గ్రామాల పరిధిలో బ్యాంకింగ్ సేవలను విస్తృతం చేసి గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న అన్ని రకాల సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రతి గ్రామంలో రైతులు, మహిళా సంఘాలు, విద్యార్థులకు బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలను తరచూ నిర్వహించాలన్నారు. పిఎం కిసాన్ లబ్ధిదారులకు కేసిసి మంజూరుకు సంబంధించి ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించి కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. కార్యక్రమంలో ముందుగా జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ జి.ఆంజనేయులు డిసిసి, డిఎల్‌ఆర్‌సి సమావేశానికి సంబంధించిన అజెండా వివరాలను, ఆయా అంశాలలో బ్యాంకుల సాధించిన ప్రగతిని కలెక్టర్ కి వివరించారు. అనంతరం కలెక్టర్ నాబార్డ్ వారి 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్‌ను బ్యాంకర్లతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో ఎస్‌బిఐ, నాబార్డ్ ఎజిఎం విజయ్‌విహారి, ఆర్‌బిఐ ఎల్‌డిఎం రోహిత్ అగర్వాల్, బ్యాంక్ మేనేజర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, డిక్కి, డిఐఎ ప్రతినిధులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీకగా నిలవాలి

- హిందూ ముస్లిములు సోదర భావంతో మెలగాలి
- రాయచోటి పట్టణంలో 144 సెక్షన్ ఎత్తివేత
- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

రాయచోటి పట్టణం మతసామరస్యానికి ప్రతీక అని, పట్టణంలోని హిందూ ముస్లిములు ఎప్పటికీ సోదర భావంతో మెలగాలని రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని కలెక్టర్ ఛాంబర్‌లో మంత్రి, కలెక్టర్ శ్రీధర్ చామకూరి, ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు, జెసి ఆదర్శ్ రాజేంద్రన్‌లతో కలిసి హిందూ ముస్లిం సోదరులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలోని గాంధీ బజార్‌లో ఈ నెల 4న సాయంత్రం చోటు చేసుకున్న పరిణామాల వల్ల జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా కొన్ని ఆపోహలు తలెత్తయన్నారు. అన్న దమ్ముల్లా కలిసి మెలిసి జీవించే ప్రజల మధ్య కొన్ని వర్గాల వల్ల చిన్న గొడవ జరిగిందని పేర్కొన్నారు. అప్పటి నుంచి పట్టణంలో పోలీస్ యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేసి వారం రోజులలో ఎటువంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఉండేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టామని తెలిపారు. మరుసటి రోజు నుంచే ప్రజలు తమ తమ పనుల్లో నిమగ్నమయ్యారని చెప్పారు. పస్తుతం రాయచోటి పట్టణంలో ఎటువంటి సమస్యలు లేవని, ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవిస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో ఎక్కడ కూడా శాంతి భద్రతలకు విఘాతం కలగలేదని పేర్కొన్నారు. 40 సంవత్సరాల నుంచి రాయచోటి పట్టణం ఎదిగే కొద్ది తాము, తమ కుటుంబ సభ్యులం రాయచోటి ప్రాంత ప్రజల సంక్షేమం కోసం, ఈ ప్రాంతం అభివృద్ధి కోసం పనిచేశామని చెప్పారు. మండిపల్లి కుటుంబం ఉన్నంతవరకు రాయచోటి పట్టణంలో రెండు వర్గాల మధ్య ఉన్న ప్రేమ అభిమానం ఎల్లవేళలా అలాగే ఉంటూ ప్రజలందరూ కలిసిమెలిసి జీవిస్తారన్నారు. ఈ ఘటనలో బాధ్యులపై మాత్రమే చర్యలు తీసుకోవాలని, ఎటువంటి సంబంధం లేని అమాయకులపై కేసులు పెట్టకూడదని పోలీసు వారికి సూచించామని చెప్పారు. ఎవరో కొంతమంది కావాలని సోషల్ మీడియాలో చేసిన దుష్ప్రచారాల వల్ల పట్టణంలో జరిగిన చిన్నసమస్య రాష్ట్రవ్యాప్తంగా పాకిపోయిందన్నారు. ప్రస్తుతం రాయచోటి పట్టణంలో ఉన్న 144 సెక్షన్‌ను ఎత్తివేశామన్నారు. రాబోయే రోజులలో ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా ఉండేందుకు రంజాన్ తర్వాత మరొక పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి హిందూ ముస్లిములు ఎల్లవేళలా కలిసిమెలిసి జీవించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్, ఎస్‌పి

హోలీ పేరుతో హద్దులు దాటితే ఉపేక్షించం : ఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

హోలీ పేరుతో అనవసరమైన వ్యక్తులపై రంగులు చల్లితే ఉపేక్షించేది లేదని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హోలీ పండుగను సురక్షితంగా బాధ్యతతో ఆనందంగా నిర్వహించుకోవాలన్నారు. ఎలాంటి గొడవలకు తావు ఇవ్వరాదని పేర్కొన్నారు. అనవసరమైన వ్యక్తులపైనా, మహిళలపైనా రంగులు చల్లి హద్దులు దాటితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఎవరి స్వేచ్ఛకు భంగం కలిగించకుండా పండుగ కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. ఎవరైనా ఇతరులపై బలవంతంగా రంగులు చల్లినా ముఖ్యంగా మహిళలతో అసభ్యంగా ప్రవర్తించినా వేధించినా చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు. బలవంతంగా చందాలు వసూలు చేస్తే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నీటి బెలూన్లు, గాజుపొడి కలిపిన రంగులు వాడకూడదని పరస్పర గౌరవంతో పండగను నిర్వహించుకోవాలని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాలలో వదంతులు వ్యాప్తి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, తప్పుడు సమాచారాన్ని పంపిన వారిపై పంపినా చర్యలు తీసుకుంటామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100ను ఉపయోగించాలని తెలిపారు. ప్రజలందరూ హోలీ పండుగను ఆనందంగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సరళమైన సాహిత్యం..మొల్ల కవిత్వం : జెసి


మొల్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెసి, అధికారులు, నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

శ్రీరాముడి చరితమును సామాన్యులకు సైతం అర్థమయ్యే భాషలో సరళంగా రాసిన ఘనత కవయిత్రి మొల్లది అని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీ మొల్లమాంబ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెసి, డిఆర్‌ఒ మధుసూదన్‌రావు హాజరై పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ కడప జిల్లా గోపవరం గ్రామంలో కుమ్మరి కుటుంబంలో జన్మించిన ఆతుకూరి మొల్ల 16వ శతాబ్దపు తెలుగు కవయిత్రి అన్నారు. ఆమె రచనా శైలి చాలా సరళం, రమణీయమన్నారు. తాళ్లపాక తిమ్మక్క తర్వాత చెప్పుకోదగ్గ రెండవ తెలుగు కవయిత్రి మొల్ల అని కీర్తించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి సురేష్ మాట్లాడుతూ శ్రీ కృష్ణదేవ రాయలు సమయంలో ఈమె రచించిన రామాయణం మొల్ల రామాయణంగా ప్రసిద్ధి చెందిందన్నారు. మొల్ల రామాయణం ఆరు కాండాలలో 871 పద్యాలతో రచించారని చెప్పారు.. ఈ కావ్యాన్ని మొల్ల కేవలం ఐదు రోజులలో రాశారని చెప్పారు.ఁ. మొల్ల రచన ఆనాటి పద్ధతికి విరుద్ధంగా వాడుక భాషకు దగ్గరగా ఉందని తెలిపారు. అంతకుమునకు రాయచోటి బంగ్లా సర్కిల్ దగ్గర ఉన్న మంగళ విగ్రహానికి వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ మధుసూదన్‌రావు, జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు డివిటి పద్మా యాదవ్, జిల్లా శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్ర, లీగల్ అడ్వయిజర్ భద్రయ్య, కలెక్టరేట్ ఎఒ నాగభూషణం పాల్గొన్నారు. **రాయచోటి టౌన్ :** తెలుగుజాతి విలువైన రత్నం కవ యిత్రి మొల్ల అని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణం వైసిపి కార్యాలయంలో కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి సంస్కృత భాషలో రచించిన రామాయణాన్ని సామాన్యులకు అర్థమయ్యేలా తెలుగుభాషలో రచించిన తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాం త్‌రెడ్డిని కుమ్మర శాలివాహన సంఘం వారు సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, వైఎస్ఆర్ సిపి జిల్లా ఉపాధ్యక్షుడు పల్లపు రమేష్, శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, గౌరవాధ్యక్షుడు మెదరపల్లె సుబ్బయ్య, కౌన్సిలర్లు కసిరెడ్డి వెంకట నరసింహారెడ్డి, షబ్బీర్, బిసి సెల్ అధికార ప్రతినిధి విజయభాస్కర్, సుగవాసి శ్యామ్, వాల్మీకి సంఘ అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, రియాజుర్ రెహమాన్, జానం రవీంద్ర యాదవ్, చిన్న సంజీవయ్య, మహేష్‌రెడ్డి, నాజర్, అశోక్, జగన్, చంద్ర పాల్గొన్నారు. **నందలూరు :** మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో కవయిత్రి మొల్ల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయలలిత కుమారి ఆధ్వర్యంలో తెలుగు ఉపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ, గీత, రమణమ్మలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఖాదర్ బాషా, శిల్పి ఆనందాచారి, జీవి ప్రసాదరావు, రవిశంకర్ రెడ్డి, నాగిశెట్టి లక్ష్మీనారాయణ, బోగా వెంకటసుబ్బయ్య, మస్తాన్, తులసీ స్వర్ణలత, జ్యోతి ప్రియ, విజయ కుమారి, ఆర్. వి. రమణమ్మ, గౌరి, ప్రమీల రాహేల్ పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :**వాల్మీకి రచించిన రామాయణాన్ని సంస్కృతం నుండి తెలుగులోకి ఐదు రోజుల్లో అందరికీ అర్థమయ్యే విధంగా వచన కావ్యంగా రచించిన తొలి తెలుగు మహిళ కవయిత్రి శ్రీకుమ్మర్ల మొల్ల అని జిల్లా కుమ్మర శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షులు గోవింద రాజులు అన్నారు. సొసైటీ కాలనీలో మదనపల్లి డివిజన్ కుమ్మర శాలివాహన సంఘం ఆధ్వర్యంలో మొల్ల జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి, సంఘం గౌరవ అధ్యక్షులు రంగప్ప, కార్యదర్శి గంగులప్ప, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సి.శ్రీనివాసులు, పట్టణ కమిటీ ప్రతినిధులు శంకర, కృష్ణమూర్తి, వెంకట నారాయణ, భాస్కర్, రమేష్, మురళి, లోహిత్ సాయి పాల్గొన్నారు.


ఆదిత్య కళాశాలలో విద్యార్థులకు యోగా నిర్వహిస్తున్న వెంకట కామేశ్వరరావు

యోగాతో మానసిక ఉల్లాసాన్ని పొందొచ్చు

ప్రజాశక్తి-మదనపల్లె

విద్యార్థులు యోగాతో మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చని మైసూర్ దత్తక్రియ యోగా ఇంటర్నేషనల్ కేంద్రం డైరెక్టర్ వెంకటకామేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక మిట్స్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల మనసు శాంతిగా ఉంచుకోవాలన్నారు. మనస్సును ఏకాగ్రతపై తీసుకురావడానికి మెడిటేషన్ అనేది చాలా అవసరమని తెలిపారు. ధ్యానం మనస్సుకు విశ్రాంతతనిస్తుందన్నారు. మెడిటేషన్ వల్ల పెరిగిన రక్తపోటు నార్మల్‌గా మారుతుందని పరిశోధనలో వెల్లడైందని పేర్కొన్నారు. కార్యకమంలో డాక్టర్ శివ ప్రకాష్, స్టూడెంట్స్ ఆక్టివిటీ సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రెడ్డి హేమంత, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ దామోదరం, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, దత్తక్రియ యోగ ఇంటర్నేషనల్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారని డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సతీష్ బాబు, హుమ్యానిటీస్ అండ్ సైన్స్ విభాగ్యపతి డాక్టర్ అమర్నాథ్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అరుణ్ కుమార్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చంద్రశేఖర్, అధ్యాపకులు అశోక్ కుమార్, హేమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన ప్రొఫెసర్ ప్రదీప్‌కు సన్మానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఫార్మసిటికల్ కెమిస్ట్రీ విభాగంలో సేవలు అందిస్తున్న వై.ప్రదీప్ కుమార్ ఇటీవల నంద్యాల శాంతిరాం ఫార్మసీ కళాశాల వారు నిర్వహించిన అంతర్జాతీయ ఇండోకరీబియన్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో స్త్రీలలో వచ్చే బ్రెస్ట్ కేన్సర్‌కు ఉపయోగించే ఔషధంపై తన పత్ర ప్రదర్శనతో మొదటి బహుమతి సాధించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత తెలిపారు. ఈ విజయాన్ని సాధించినందుకు కళాశాల వైస్ చైర్మన్ సి.ఎల్లారెడ్డి, డాక్టర్ సి.రామచంద్ర రెడ్డి, కోశాధికారి అభిషేక్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ సి.గంగిరెడ్డి, ప్రదీప్ కుమార్‌ను గురువారం ఫార్మసీ కళాశాలలో ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు.

ఫ్లెక్సీల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నారని, మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి పడుతోందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ అన్నారు. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మున్సిపల్ మేనేజర్ మనోహర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా హోర్డింగ్స్ ఏర్పాటు చేస్తున్నారని, వాటిని వెంటనే తొలగించాలన్నారు. మున్సిపాలిటీకి పన్ను చెల్లించకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తొలగించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. స్పందించిన మేనేజర్ అనధికార ఫ్లెక్సీలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు జయబాబు, అకిఫ్, సమీర్, అఫ్రిద్, ప్రేమ్ పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మదనపల్లె

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 17న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి.వెంకట్రామయ్య, జిల్లా కోశాధికారి హరింద్రనాథ్ శర్మ, సంఘం జిల్లా కార్యదర్శి సురేంద్రబాబు పిలుపునిచ్చారు. డిఎల్‌పి కార్యాలయంలో వద్ద జరిగిన మదనపల్లి డివిజన్ పంచాయతీ కార్మికుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమకు ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు వేతనాలు పెంచాలన్నారు. 8 సంవత్సరాల నుండి తమ జీతాలు పెంచలేదని, ఎక్కడా కనీస వేతనాలు ఇవ్వడంలేదన్నారు. ఇచ్చే అరకొరజీతాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. కోర్టు తీర్పు ప్రకారం జిల్లాలో అందరినీ పర్మనెంట్ చేయాలని డిమాండు చేశారు. పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, కొన్ని చోట్ల జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని, గుర్తింపు కార్డులు, పనిముట్లు, చెప్పులు, సబ్బులు, కిట్లు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులు ఆపాలని, తొలగించిన వారినందరి తిరిగి పనిలోకి తీసుకోవాలని, పని ఒత్తిడి తగ్గించాలన్నారు. జిఒ 551, 132, 142, 680లను వెంటనే అమలు చేయాలని కోరారు. అనంతరం డిఎల్‌పిఒ నాగరాజు వినతిపత్రం అందజేసారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల నాయకులు గోపాల్, రవి, శీను, రాజు, ఆనంద, శంకర, రాణి, కమల, శ్యామల, ప్రమీల పెద్ద సంఖ్యలో మహిళలు, కార్మికులు పాల్గొన్నారు. అనంతరం మదనపల్లె పరిసర ప్రాంతాలైన కొండామర్రిపల్లి, కొత్తపల్లి, కురవంక, పొన్నేటిపాలెం పంచాయతీల్లో పర్యటించి మహాధర్నాలో అందరూ పాల్గొనాలని ప్రచారం నిర్వహించారు.

మెగా జాబ్‌మేళా కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాయచోటి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, ఎపి స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపిఎస్ఎస్‌డిసి), సీడాప్, జిల్లా ఉపాది కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో రాయచోటి శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. మేళాను ఈనెల 21న నిర్వహిస్తారని పేర్కొన్నారు. మేళాలో టెక్ మహీంద్రా, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఇండిగో ఎయిర్‌లైన్, అడక్కో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఆధ్య హెచ్‌ఆర్ సొల్యూషన్స్, నియో లింక్, ముత్తూట్ ఫైనాన్స్, టాటా క్యాపిటల్, బిగ్‌సి, ఫోన్ పే, ఫ్లిప్ కార్ట్, అపోలో ఫార్మసీ తదితర కంపనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. జిల్లాలోని ఆసక్తి గల యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.


ఆయుధాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఎఎస్‌పి వెంకటాద్రి

అవసరమైతే పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించాలి : ఎఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్: విద్యార్థులు అవసరమైనప్పుడు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాలని అన్నమయ్య జిల్లా అదనపు ఎస్‌పి ఎం.వెంకటాద్రి అన్నారు. గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసులు వినియోగిస్తున్న వివిధ రకాల అత్యాధునిక ఆయుధాల గురించి, బాంబ్ డిస్పోజల్స్ పరికరాలు, సమాచార సాంకేతిక గురించి విద్యార్థులకు పోలీస్ సిబ్బంది అవగాహన కల్పించారు. మొబైల్ అధిక వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ క్రైమ్, మహిళల స్వీయ రక్షణ, శక్తి యాప్ గురించి క్లుప్తంగా వివ రించారు. అవసరమైతే పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి సాయం పొందాలని తెలి పారు. డయల్ 100, 112,1098 నంబర్ల గురించి అవగాహన కల్పించారు. ఆనం దంగా జీవించేందుకు అవలంబించాల్సిన విధివిధానాల గురించి తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ అడ్మిన్ వి.జె. రామకృష్ణ, ఆర్‌ఎస్‌ఐలు అమర్నాథ్‌రెడ్డి, రవి, పోలీస్ సిబ్బంది, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి : బిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: దళితులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన వారిపై పోలీసులు ఇంత వరకు కేసు నమోదు చేయకపోవడంపై బాధితులు బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి మిద్దేపల్లి బాలాజీ అన్నారు. గురువారం మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌ను ఆశ్రయించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వలసపల్లె పంచాయతీ బొగ్గిటివారిపల్లెలో గ్రామకంఠం భూమి విషయమై ఈ నెల 9వ తేదీన వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన కొందరు దళితులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. దాడిలో వెంకటస్వామి తీవ్ర గాయాల పాలై 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ఇతనితో పాటు నారాయణ, రజిత, రత్నమ్మ, కృష్ణవేణి తదితరులు గాయపడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేయకపోవడంపై గురువారం తాలూకా సిఐ కళా వెంకటరమణను సంప్రదించగా ఎక్కువ మాట్లాడితే మీపైనే కేసులు కడతానని తీవ్రంగా హెచ్చరించారన్నారు. స్పందించిన సబ్ కలెక్టర్ డిఎస్‌పికి సిఫారసు చేస్తున్నామని న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్, నరసింహులు, బాధితులు నారాయణ, వెంకటస్వామి, రత్నమ్మ, సురేంద్ర పాల్గొన్నారు.

చెత్త రహిత జిల్లాగా మార్చేందుకు కృషి : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 15న జిల్లావ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి చెత్త రహిత జిల్లాను రూపొందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు.గురువారం రాయచోటి కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి స్వర్ణఆంధ్ర - స్వచ్ఛఆంధ్ర, పి4 సర్వే, గృహ నిర్మాణ ప్రగతి, జిల్లా జిడిపి పెంచడానికి కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన, వర్క్ ఫ్రంహోం సర్వే, ఇతర అంశాలపై జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, డిఎల్‌డిఒలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ డిఇలు, ఎఇలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 24, 25 తేదీలలో విజయవాడలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జిల్లా కలెక్టర్ల సమావేశం ఉందన్నారు. జిల్లాకు సంబంధించి ఆయా శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలను 20 లోగా పూర్తిచేయాలని సూచించారు. తద్వారా జిల్లా ప్రగతిని ముఖ్యమంత్రి గారికి వివరించ గలుగుతామన్నారు. ప్రతి శాఖ వారికి నిర్దేశించిన లక్ష్యాలను వందశాతం సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈనెల 15న మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఈ మాసం అంశం 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం'పై ప్రజలలో విస్తృతంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. రాబోయే కాలంలో దాని వాడకాన్ని నిషేధించేలా కూడా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, అన్ని మున్సిపాలిటీలు, పంచాయతీలు, ఆసుపత్రులు, వ్యాపార సముదాయాలు, బహిరంగ ప్రదేశాలు, పర్యాటక ప్రాంతాలు, ఇతర ముఖ్య కూడళ్ళు, తోపుడు బండ్ల వ్యాపారులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి, మనుషులకు జరుగుతున్న నష్టాలను వివరించి వాడకాన్ని తగ్గించేలా కృషి చేయాలన్నారు. ఆయా ప్రాంతాలలో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించి చెత్తను చెదారాలను తొలగించాలని సూచించారు. ఇళ్లు లేని నిరుపేదలందరికీ 2029 నాటికి ఇంటిని ఏర్పరిచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా గత ప్రభుత్వ కాలంలో చేపట్టి ఇంకను పూర్తికాని ఎస్‌సి, ఎస్‌టి, బిసి లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం అందజేసి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని పేర్కొన్నారు. పి4, వర్క్ ఫ్రం హోం సర్వేలను పక్కాగా చేయాలని సూచించారు. పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అందిన సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలన్నారు. రెవెన్యూ, రీ సర్వే గ్రామసభలలో వచ్చిన పిటిషన్లను కూడా ఈనెల 19లోగా నాణ్యతగా పరిష్కరించాలని చెప్పారు. ఓటర్ల నమోదులో భాగంగా ఫారం-7 లను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్‌ఒ మధుసూదన రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, డిఎల్‌డిఒలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ డిఇలు, ఎఇలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



నూతన గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ముక్కా రూపానందరెడ్డి

ప్రజలకు మెరుగైన సేవలు : 'ముక్కా'

ప్రజాశక్తి-పుల్లంపేట

ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ ధ్యేయమని కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఓబులవారిపల్లి మండల పరిధిలోని చిన్నంపల్లి గ్రామంలో సచివాలయం, సిమెంటు రోడ్డును, ముక్కావారి పల్లిలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ అధికారులు సచివాలయ సిబ్బంది ప్రజలకు జవాబుదారీతనంగా వ్యవ హరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా కొన్ని వేల కోట్ల సిమెంట్ రోడ్లు వేస్తున్నామని చెప్పారు. రైల్వే కోడూరు నియోజవర్గంలో ఎక్కడైనా సిమెంట్ రోడ్డు లేకుంటే తమ దృష్టికి తీసుకవస్తే వెంటనే సిమెంటు రోడ్డును వేయడానికి సంబం ధిత అధికారుల నుంచి అనుమతులను ఇప్పిస్తామని చెప్పారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని నియోజకవర్గ వ్యాప్తంగా నీటి సమస్య రాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నియోజకవర్గంలో విద్యుత్, తాగునీరు, సిమెంటు రోడ్డు మొదలగు వాటిల్లో అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి తమ్మిద తిరుపాలు, ఆనంద గజపతిరాజు, తహశీల్దార్ శ్రీధర్‌రావు, ఎంపిడిఒ మల్ రెడ్డి, ఎస్ఐ మహేష్ నాయుడు, సచివాలయ సిబ్బంది, మండల అధికారులు , కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్ఐలకు డిటిలుగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు మండలాల ఆర్ఐలుగా విధు లు నిర్వహిస్తున్న బాలాజీ, అనీషాలకు డిప్యూటీ తహశీల్దార్లుగా ఉద్యోగోన్నతి లభించింది. గురువారం రెవెన్యూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బాలాజీ తంబళ్లపల్లి, బి.కొత్తకోట మండలాల ఆర్ఐగా పనిచేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలువురు రెవెన్యూ సిబ్బందికి ప్రమోషన్లు లభించాయి. అందులో భాగంగా వీరిద్దరికీ డిప్యూటీ తహసిల్దార్లుగా పదోన్నతి లభించింది.

ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-కలకడ

అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి ప్రజల ఆరోగ్య కోసం పాటుపడుతున్న పంచాయతీ కార్మికులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ చొరవ తీసుకుని జీతాలు పెంచవలసిన అవసరం ఉందని మాట్లాడటం అభినందనీయని అన్నారు. కలకడ మండల పంచా యతీ కార్మి కులు, టిడిపి మండల అధ్యక్షులు ప్రభాకర్ నాయుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిత్రప టానికి పాలాభిషేకం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలకడ టౌన్ ఇన్ ఛార్జి జిలానిబాషా, జాఫర్ హుస్సేన్, ఖాజా హుస్సేన్, జిరాక్స్ అల్లి, ఇర్ఫాన్‌బాషా, జావిద్‌బాషా, పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లె మోడల్ స్కూల్ 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ హేమంత్ కుమార్ తెలిపారు. ఎంపిసి, బైపిసి, సిఇసి,ఎంఇసి, గ్రూపులు ఉన్నాయన్నారు. పది పాస్ అయిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఒసి, బిసి, ఇబిఎస్ విద్యార్థులు రూ.200లు, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు రూ.150లు చెల్లించి ఈ నెల17నుంచి మే22 లోపు https://apms.apcfss.In లేదా https://cse.ap.gov.In వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కుక్కల దాడిలో కృష్ణ జింక మృతి

ప్రజాశక్తి-ములకలచెరువు



మృతి చెందిన కృష్ణ జింక

కుక్కల దాడిలో కృష్ణ జింక మృతి చెందిన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, అటవీ శాఖ అధికారుల కథనం మేరకు. .ములకలచెరువు మండలం, కదిరినాథునికోట సమీపంలో మేత కోసం వచ్చిన కృష్ణ జింక ను ఊరు కుక్కలు వెంబడించి దాడికి పాల్పడ్డాయి. ఈ దాడిలో కృష్ణ జింక తీవ్రంగా గాయపడింది. కుక్కల దాడిలో గాయపడి కృష్ణ జింకను స్థానికులు గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకునేలోపే కృష్ణ జింక మృతి చెందినట్లు తెలిపారు. పిటిఎం రోడ్డులో గుర్తుతెలియని వాహనం ఢీకొని మరో కృష్ణ జింక మృతి చెందింది. మృతిచెందిన కృష్ణ జింకలను కనుగొండలో ఖననం నిర్వహించారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-పుల్లంపేట : మండల పరిధిలోని కనకదుర్గమ్మ తిరుణాల మహోత్సవానికి వచ్చిన ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందని మండల విభిన్న ప్రతిభా వంతుల సమైక్య సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ మల్లు నంబ్బ నరసారెడ్డి పేర్కొన్నారు. దాదాపు రెండు వేల మందికి అన్న దాన కార్యక్రమం చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోశాధికారి నరసింహులు, సభ్యులు ఆనంద్, శ్రీనివాసులు, జ్యోతిశ్వర్ నాయుడు, వాలంటీర్లు నాగార్జున, మురళి గుణశేఖర్ పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజమే లక్ష్యం

రాజంపేట అర్బన్:

అవగాహనతోనే టిబి వ్యాధిని నివారించవచ్చునని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సానేశేఖర్ పేర్కొన్నారు. టిబివ్యాధి అవగాహన మాసోత్సవాలలో భాగంగా రాజంపేట మున్సిపాలిటీ పరిధిలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు పైబడి దగ్గు, రాత్రి పూట జ్వరం రావడం, ఛాతిలో నొప్పి, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, గళ్ళలో రక్తం పడటం వంటి లక్షణాలు ఉంటే టీబీ వ్యాధి అని అనుమానించి ఆశ కార్యకర్తలను సంప్రదించి ప్రభుత్వ ఆసుపత్రిలో గల్ల పరీక్ష చేయించుకోవాలని అన్నారు. టీబీ వ్యాధి ఒకరి నుండి మరొకరికి నోటి తుంపర్ల ద్వారా వ్యాపిస్తుందని, ఒకవేళ వ్యాధి ఉందని నిర్ధారణ అయితే ఆరు మాసాలు మందులు పూర్తి ఉచితంగా ప్రభుత్వం అందచేస్తుందన్నారు. కార్యక్రమంలో టిబి పర్యవేక్షకులు జయప్రకాష్, అప్తమాలిస్ట్ ఓబులేష్, సీనియర్ క్లర్క్ సిద్ధి రామయ్య, ల్యాబ్ సూపెర్వైసర్ మల్లిఖార్జున, ఎఎన్ఎం, ఆశ పాల్గొన్నారు. **కలికిరి :** అవగాహనతోనే టిబి దూరం అవుతుందని కలికిరి మండలం మెడిక్కుర్తి పిహెచ్‌సి వైద్యులు కావ్య గంధ, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి పేర్కొన్నారు. డిఎంహెచ్ఒ ఆదేశాల మేరకు గురువారం మండలలోని నాగిరిపల్లిలో నిర్వహిస్తున్న 104సేవలలో భాగంగా టిబి వ్యాధిపై మండల కేంద్రంలోని ప్రజలు, జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు వారాలకు పైబడి దగ్గు ఉన్నా, దగ్గినపుడు గళ్ళ పడటం, గళ్ళ లో రక్తం



రాజంపేట : మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ సానే శేఖర్

పడటం, రోజు సాయంత్రం జ్వరం రావడం, గస, ఆయాసం, నీరసం, ఆకలి లేక పోవుట, బరువు తగ్గడం, చాతిలో నొప్పి వంటి లక్షణాలు ఉంటే క్షయ వ్యాధి అయి ఉండవచ్చు అని అనుమాన పడి సమీపంలో ఉన్న ఆశాకార్యకర్త ను గాని ఆరోగ్య సిబ్బంది ని గాని సంప్రదించాలని తెలిపారు. అనంతరం నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఎంఇఒ కరీముల్లా, ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్ రఫీ, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి, టిబి అవగాహనా కరపత్రాలను ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో వైద్యులు కావ్య గంధ, ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్ రఫీ, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి, హెచ్.ఎం.జయమ్మ, ఎఎన్ఎం పార్వతి పాల్గొన్నారు.

అసంపూర్తి గృహాలకు అదనపు ఆర్థిక సాయం

- లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలను చేపట్టాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె



కలకడ: మాట్లాడుతున్న ఎంపిడిఒ అబ్దుల్ రహీం

అసంపూర్తి గృహాలకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం అందిస్తోందని ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, ఎఇ రమేష్‌బాబు, గృహ నిర్మాణ శాఖ మండల ఇన్‌ఛార్జి అమర్నాథ్ తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు మంజూరై ఇంకా వివిధ దశలలో అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న గృహా లను పూర్తి చేయటానికి అదనంగా ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తోందని తెలి పారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ సహకారంలో భాగంగా 2029 నాటికి అందరికీ ఇల్లు నిర్మించాలనే లక్ష్యంతో అసంపూర్తి ఇళ్ల నిర్మాణాల పూర్తికి ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు చేపట్టిందన్నారు. మండలంలో మొత్తం 2105 గృహాలు మంజూరు కాగా, 1633 గృహాల నిర్మాణాల పూర్తయినట్లు తెలిపారు. ఇంకా వివిధ దశలలో 469 గృహాలు ఉండగా, పూర్తిగా ప్రారంభించని మూడు గృహాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఎస్‌సిలు-104, ఎస్‌టి-8, బిసి-220 గృహాలు వివిధ నిర్మాణ దశలో ఉన్నాయని మొదటగా వీరందరికీ అదనపు ఆర్థిక సాయం అందుతుందని అన్నారు. 10-12-24 నుంచి పూర్తయిన ఇళ్లకూ అదనపు ఆర్థిక సాయం వర్తిస్తుందని పేర్కొ న్నారు. ఎస్‌సి, ఎస్‌టి,బిసి వర్గానికి చెందిన పక్కా గృహ లబ్ధిదారులు వెంటనే కులం ధ్రువీకరణ పత్రాన్ని మండల గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో అందిం చాలని సూచించారు. ఈ మేరకు పూర్తి వివరాల కోసం మండల గృహ నిర్మాణ శాఖ అధికా రులను లబ్ధిదారులు సంప్రదించి, సమాచారాన్ని తెలుసుకొని, ఇళ్ల నిర్మాణా లను పూర్తి చేయాలని అయన కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి, ఎఇ రమేష్‌బాబు, గృహనిర్మాణశాఖ మండల ఇన్‌ఛార్జి అమర్నాథ్, సిబ్బంది రవి పా ల్గొన్నారు.**పుల్లంపేట :** ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని ఎంపడిఒ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో మండలస్థాయి సచివాలయ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులతో గృహ నిర్మాణాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లకు రూ.1.80లక్షలకు అదనంగా ఎస్‌సి, బిసిలకు రూ.50వేలు ఎస్‌టిలకు రూ.75వేలు ఆర్థిక సహాయాన్ని అందిస్తోందన్నారు. ఈ సాయానికి 2025 మార్చి నుంచి ఏప్రిల్ చివరి వరకు మాత్రమే గడువు ఉందని, లబ్ధిదారులకు ఇది చివరి, మంచి అవకాశమని అన్నారు. లబ్ధి దారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకొని తమ ఇళ్లను పూర్తి చేసుకోవాలని సూచిం చారు. **వీరబల్లి:** పక్కా గృహాలు పొంది వివిధ దశలలో ఉన్న నిర్మాణాలు మధ్యలో ఆపే సిన లబ్ధిదారులకు ఎస్‌సి, బిసిలకురూ.50వేలు, ఎస్‌టిలకు రూ.75 వేలు ప్రభుత్వం పెం చిందని మండల విస్తరణ అధికారి రామచంద్రారెడ్డి, హౌసి ంగ్ ఎఇ వెంకటేష్ తెలిపారు. కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ సిబ్బందితో, ఇంజి నీరింగ్ అసిస్టెంట్లతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలో 174 పక్కా గృహాలు వివిధ దశలో ఉన్నాయన్నారు. వెంటనే నిర్మాణాలు చేపట్టాలని కోరారు. **కలకడ:** హౌసింగ్ లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపిడిఒ అబ్దుల్ రహీం తెలిపారు. మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హౌసింగ్ లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గత ప్రభుత్వంలో ఇంటి నిర్మాణాలు చేపట్టలే మధ్యలోనే నిలిపివేసిన లబ్ధిదారులను అదనపు ఆర్థిక సాయం అందిస్తోందని అన్నారు. మండలంలో 37 మంది ఎస్‌సిలు, 9 మంది ఎస్‌టిలు, 136 మంది బిసిలకు గృహాలు మంజూరయ్య అన్నారు. ఈ నిర్మాణాలు వివిధ దశలో ఉన్నాయని వీటికి ప్రభుత్వం అదనంగా డబ్బులు చెల్లించడం జరుగుతుందని .ఈ కార్యక్ర మంలో హౌసింగ్ ఎఇ నాగమునినాయక్ లబ్ధిదారులు పాల్గొన్నారు .**రామాపురం :** మండల వ్యాప్తంగా 2365 పక్క గృహాలు మంజూరు కాగా అందులో 1119 గృహాలు పూర్తయ్యాయని మిగిలిన పక్క గృహాలు వివిధ దశలో నిర్మాణంలో ఉన్నాయని హౌసింగ్ డిఇ వెంకట సుబ్బరామయ్య పేర్కొన్నారు. ఎస్‌సిలు120 , ఎస్‌టిలు15, బిసిలు 282 మంది లబ్ధిదా రులకు గృహాలకు ప్రభుత్వం అదనంగా ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జాషువా. ఇఒపిఆర్‌డి పట్నాయక్, కెఎస్ఎం ప్రసాద్ పాల్గొన్నారు.**నందలూరు:** మండల గృహ లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రాయితీలు ప్రకటించినట్లు ఎంపిడిఒ రాధాకృష్ణంరాజు పేర్కొన్నారు. మండలంలో 2019-24 సంవత్సర కాలవ్యవధిలో ఇల్లు మంజూరై ఇన్ ప్రోగ్రెస్‌లో ఉన్న ఎస్‌సి లబ్ధిదారులు 118, ఎస్‌టి లబ్ధిదారుల 36, బిసి లబ్ధిదారులు 209 మంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కోరారు. **లక్కిరెడ్డిపల్లి :** మండలంలో 109 ఇండ్లు గుణాది దశలో, 108 ఇండ్లు గోడలు దశలో, 37 ఇళ్లు కాంక్రీట్ పూర్తి అయ్యిన దశ లలో ఉన్నాయని హౌసింగ్ ఎఇ జనార్ధన పేర్కొన్నారు. ఏప్రిల్ 20 వ తేదీ లోపు ఇంటి నిర్మాణం పూర్తి చేసుకునే లబ్ధిదారులకు ఈ అవకాశం ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు ఉపయోగించుకోవాలని ఎంపిడిఒ ఉషారాణి తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో అధిక ఆదాయం



మాట్లాడుతున్న కెవికె కో-ఆర్డినేటర్ మంజుల

ప్రజాశక్తి-కలికిరి

మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే అధిక ఆదాయం లభిస్తుందని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మామిడి రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం మామిడిలో పూత చాలా విరివిగా వచ్చిందని తగు సస్యరక్షణ చర్యలు పాటించి నాణ్యమైన పంటను పొందవచ్చునని అన్నారు. మామిడిలో ఫ్రూట్ కేర్ ఆక్టివిటీ కింద మామిడి కాయలకు కవర్లు తొడగడం వల్ల నాణ్యత పెరిగి పురుగు మందు అవశేషాలు లేకుండా ఎగుమతికి వీలు అవుతుందన్నారు. కలికిరి మండల ఉద్యాన అధికారి సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యాన శాఖ తరపున మామిడి కాయలకి ఉపయోగించే కవర్ లు సబ్సిడీతో ఆదిస్తున్నామని అన్నారు. కావలసిన రైతులు దగ్గరలోని రైతు సేవ కేంద్రాలలో నమోదు చేసుకొని పొందవచ్చు అన్నారు. ఒక్కొక్క కవర్ ధర రు.2.20, ఇందులో సబ్సిడీ రూ.1, రైతు భాగంగా రు.1.20 చెల్లించి పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వాయల్పాడు ఉద్యాన శాఖ అధికారి ఇ.ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి, రైతు సేవ కేంద్రసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నూనెగింజల పంట సాగుతో లాభాలు

పీలేరు: నూనెగింజల పంట సాగుతో రైతులకు అధిక ఆదాయం సాధ్యమని సహాయ వ్యవసాయ సంచాలకులు వైవి రమణ రావు తెలిపారు. పీలేరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో డివిజన్ స్థాయిలోని కెవి పల్లి, పీలేరు మండల రైతులకు 'జాతీయ మిషన్-వంట నూనెలు-నూనె గింజలు'అంశంపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన రైతులకు వేరుశనగలో యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ప్రీ ఎమర్జన్సీ కలుపు మందు పెండిమితలిన్ వాడకం, పూత దశలో జిప్సం వాడకం, మొక్కల సాంద్రత ,వంటి అంశాలు, వేరుశనగ పంట ప్రాధాన్యతను తెలిపారు. కార్యక్రమంలో కె పల్లి మండల వ్యవసాయ అధికారి యు.శ్రావణి, పీలేరు మండల వ్యవసాయ అధికారిణి రమాదేవి, టెక్నికల్ ఎఇ కరుణాకర్ రెడ్డి, కెవిపల్లి, పీలేరు మండల రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది జహీర్, ప్రవీణ్, అనీల్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం మానవాళి మనుగడకే ప్రమాదకరం

ప్రజాశక్తి-కలకడ

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ సహ కరించాలని ఎంపిడిఒ అబ్దుల్ రహీం పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఆదేశాల మేరకు ప్రతినెల మూడో శనివారం జరుగు స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిషేధంపై కలకడలో చిరు వ్యాపారస్తులు, గ్రామపంచాయతీ నాయకులతో ఎంపిడిఒ అబ్దుల్‌రహీం, అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. మండలంలో ఎక్కడ గాని ప్లాస్టిక్ వాడ కం ఉండరాదని హోట ళ్లలో, చౌక దుకాణాలు, చిరు వ్యాపారస్తులు ప్లాస్టిక్ వాడు తున్నారని తెలిస్తే కేసులు నమోదు చేసి లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్లాస్టిక్ వాడుతున్నట్లు గుర్తించి వారికి నోటీసులు జారీ చేయాలని పంచా యతీ కార్యదర్శి దేవేంద్రను ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్ప ంచ్ పారిజాన్ జావాద్‌అలీఖాన్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-పీలేరు : క్షేత్ర స్థాయిలో పర్యటించే సిబ్బంది ప్రజా సమస్యలను గుర్తించి వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాషా తెలిపారు. గురువారం స్థానిక పచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బిల్ కలెక్టర్లు, అసిస్టెంట్ బిల్ కలెక్టర్లు, జూనియర్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు సిబ్బంది వార్డుల్లో పర్యటించే సమయంలో స్థానికంగా ఉండే నీరు, మురుగునీటి కాలువలు, వీధి దీపాలు, పారిశుధ్య సమస్యలను గుర్తించి వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుక రావాలని తెలిపారు. సమస్యలను పరిష్కరించినప్పుడే ప్రజల్లో మంచి పేరు, గుర్తింపు సాధ్యమవుతుందని అన్నారు. సమావేశంలో జూనియర్ సహాయకులు చంద్రకళ, ప్రసాద్‌రెడ్డి, బిల్ కలెక్టర్లు మోహిత్, బాబ్జి, దీపిక, సహాయ బిల్ కలెక్టర్లు రవి, సీన మున్నా, గురు,కిషోర్,ఆచారి, దాదాపీర్, సుబ్బు పాల్గొన్నారు.

పోలీసుల రక్షణ కోరిన ప్రేమజంట

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : కులాంతర వివాహం చేసుకున్న తమకు పెద్దల నుంచి రక్షణ కల్పించాలంటూ గురువారం ప్రేమజంట టూటౌన్ పోలీసులను ఆశ్రయిం చారు. మదనపల్లె మండలం వేంపల్లె పంచాయతీ నల్లగుట్లవారిపల్లెకు చెందిన సతీష్(24), చంద్రాకాలనీకి చెందిన స్వాతి(22) గత నాలుగేళ్లుగా ప్రేమించు కుంటున్నారు. అయితే వీరి కులాలు వేరుకావడంతో వీరి ప్రేమపెళ్లికి ఇరువురి తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. నాలుగురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి ఓ గుడిలో వివాహం చేసుకున్నారు. అనంతరం రక్షణ కల్పిం చాలంటూ టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. ఇద్దరూ మేజర్లు కావడంతో ఇరు వురి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి కొత్తజంటకు రక్షణ కల్పించినట్లు పోలీసులు చెప్పారు.



పోలీసులను ఆశ్రయించిన సతీష్, స్వాతి



ఆర్‌టిసి బస్సు కండీషన్‌ను పరిశీలిస్తున్న డిఎం పి.రాము

ఆర్‌టిసి బస్సుల కండీషన్ పరిశీలన

ప్రజాశక్తి-కలకడ

ఆర్‌టిసి బస్సుల కండిషన్ సక్రమంగా ఉందా లేదా అని జిల్లా ప్రజా రవాణా అధికారి పి.రాము పరిశీలించారు. గురువారం రాయచోటి నుంచి పీలేరు వైపు వెళ్తున్న ఆర్‌టిసి బస్సును కలకడ సమీపంలో నిలిపి తనిఖీలు నిర్వహించినట్లు పీలేరు డిపో మేనేజర్ నిర్మల తెలిపారు. బస్సు గతంలో ఎన్ని కిలోమీటర్లు తిరిగింది, దాని పరిస్థితులు ఎలా ఉన్నాయి, ఇంజిన్ కండిషన్ ఎలా ఉందనే అనే అంశాలపై ఆర్‌టిసి మెకానిక్ సిబ్బంది అడిగి తెలుసుకున్నట్టు తెలిపారు. ప్రతినెల బస్సులు కండిషన్ పై ఆరా తీయడం జరుగుతుందని అలా చేయడం వల్ల ప్రయాణికులను చేరవేసేందుకు ఆర్‌టిసి బస్సులు స్థితిగతులు ఎలా ఉన్నాయో తెలుసుకోవడానికి వీలవుతుందని తెలిపారున్నారు. ప్రతి 20 వేల కిలోమీటర్లు ప్రయాణించిన బస్సులను పరిశీలించి ఇంజిను స్థితిగతులను మెకానికుల ద్వారా తెలుసుకొని వాటిని మరమ్మతులు చేయిస్తామని డిఎం తెలిపారు. అంతేకాకుండా ఆర్‌టిసి బస్సులు ప్రమాదాలు గురైతే అత్యవసర ద్వారా ఎలా ఉన్నాయి అని ఆరా తీసి పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీలేరు ఆర్‌టిసి సిబ్బంది, మెకానిక్ సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

అర్జీదారుల సమస్యలకు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలానికి సంబంధించి రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను శరవేగంగా పరిష్కరించినట్లు తహసిల్దార్ మహ మ్మద్ అజారుద్దీన్ తెలిపారు. గురువారం తహశీల్దార్ కార్యా లయంలో మాట్లా డుతూ గతంతో పోల్చుకుంటే రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలు పరిష్క రించడంలో రెవెన్యూ సిబ్బంది మెరుగ్గా పనిచేశారని తెలిపారు. మండల రెవెన్యూ పరిధిలో మరికొన్ని అర్జీలను పరిష్క రించాల్సి ఉందని తెలిపారు. ముటే షన్లు పనిలో నిమగ్నమై ఉన్నామని, సెలవు దినాల్లో కూడా రెవెన్యూ అధికారులు పనులు చేస్తూ పెండింగ్ పనులు పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ఖలీద్, రెవెన్యూ విఆర్ఒ పాల్గొన్నారు.

వరద బాధితుల కష్టాలు వర్ణనాతీతం :'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమయ్య ప్రాజెక్టు వరదబాధితుల గోడు వింటుంటే మనసు చలించి పోతోందని టిడిపి రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు పేర్కొన్నారు. జవాన్ తుపాన్ కారణంగా అన్నమయ్య డ్యామ్ తెగిపోవడంతో పులపుత్తూరు గ్రామస్తులు గురువారం చమర్తిని ఆయన కార్యాలయంలో కలిసి వారి గోడు వెళ్ళబోసుకున్నారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ముంచే వారికి ఓటు వేసి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకున్నారని, జీవితాలు మారాలంటే మంచి వారికి ఓటు వెయ్యాలని గ్రామస్తులకు సూచించారు. ఇన్ని రోజులు మీ ఓటుతో అధికారం చెలాయించిన వారు మీకు ఏమి చేశారని అన్నారు. టిడిపితోనే బాధితులకు న్యాయం జరుగుతుం దన్నారు. అన్నమయ్య డ్యామ్ బాధితులకు అన్ని వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. నేటికీ గుడారాలలోనే బాధితులు ఉండడం బాధాకరమని, ఇప్పటికైనా గ్రామస్థుల జీవితాల మీద దెబ్బకొట్టిన వారికి బుద్ధి చెప్పాలని అన్నారు. ఈసారైనా టిడిపికి మద్దతు ఇచ్చి బంగారు భవితకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఓటు అనే ఆయుధంతో జీవితాలు మార్చుకోవాలని పిలుపునిచ్చారు. త్వరలో వరద బాధితుల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం వేగంగా చర్యలు చేపడుతామని తెలిపారు.



వరద బాధితులతో మాట్లాడుతున్న జగన్మోహన్‌రాజు

క్రైం కార్నర్



కేబుల్ వైర్ల నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

కేబుల్ వైర్ల చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలో వరుసగా జరిగిన కేబుల్ వైర్ల చోరీ కేసులో స్థానిక పోలీసులు పురోగతి సాధించారు. గత నెలలో నిమ్మనపల్లె, తవళం, అగ్రహారం, సామకోటవారిపల్లె గ్రామాలలో పదుల సంఖ్యలో వ్యవసాయ బోర్ల వద్ద 200 మీటర్ల కేబుల్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు వరుసగా దొంగలించి, ఇటు రైతులకు అటు పోలీసులకు పోలీసులకు సవాల్ విసిరిన సంగతి తెలిసిందే. ఈ కేసులో గురువారం ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఈ సందర్భంగా ఎస్ఐ తిప్పేస్వామి మాట్లాడుతూ గత నెలలో కేబుల్ వైర్ల వరుస చోరీల సంఘటన మండలంలో తీవ్ర కలకలం రేపిందన్నారు. ప్రత్యేకంగా తీసుకొని తన బృందంతో కలిసి అటు సాంకేతికంగానూ, ఇటు రాత్రి వేళల్లో సంచరిస్తున్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా, వారు కేబుల్ వైర్ల చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. కేబుల్ వైర్ల చోరీకి పాల్పడుతున్న కురబలకోట మండలం అంగళ్లకు చెందిన ఎస్.చంద్రశేఖర్, మదనపల్లె చంద్రాకాలని కు చెందిన పి.నాగార్జునలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి చోరీకి గురికాబడిన 200 మీటర్ల కేబుల్ వైర్లను రికవరీ చేసినట్లు తెలిపారు. అనంతరం నింది తులు ఇద్దరిని కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ నీట మునిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పీలేరు

చేపలు పట్టడానికి పోయిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో జారిపడి మృతి చెందిన సంఘటన జిల్లాలో చోటుచేసుకుంది. పీలేరు మండలం, దొడ్డిపల్లి గ్రామం, ఎగువ హరిజనవాడకు చెందిన ఆరుమడకల సుబ్రహ్మణ్యం(55) గురువారం తమ గ్రామ సమీపంలోని చింతలచెరువుకు చేపలు పట్టడానికి వెళ్ళాడు. ప్రమాదవశాత్తు నీటమునిగి తన కాళ్లకు చేపల వల చుట్టుకోవడంతో నీటిలో మునిగిపోయాడు. గుర్తించిన స్థానికులు బాధితుడిని కాపాడే ప్రయత్నం చేశారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.కుటుంబానికి ఆసరాగా ఉన్న వ్యక్తి మృతి చెందడంతో వారి కుటుంబంలో విషాదం నెలకొంది.